

## శిరః ప్రాణం

రాముడికి "యాక్సిడెంట్" అయింది. భరతశాస్త్రి, లక్ష్మణరావు, శతృఘన్, పరశురామయ్య, చంద్రబాబు, కృష్ణమూర్తి, అశ్వత్థామ, సైంధవుడు అంతా కంగారుగా "హాస్పటల్" కొచ్చారు.

ఒళ్ళంతా బేండేజీ కట్లతో, చెక్కు చెదరని తలతో, బెడ్ మీద పడుకుని ఉన్నాడు రాముడు.

"అన్నా? ఏమైంది?" అంటూ ఆత్రంగా ప్రక్కన కూర్చుకున్నాడు లక్ష్మణరావు.

ఏదో చెబుదామని ప్రయత్నించి మాట పెగలక కొద్దిగా ఆయాస పడసాగాడు రాముడు.

అశ్వత్థామ అందుకున్నాడు, "మీరందరూ కాదంటున్నారు గాని, చూడు గురూ? శిరస్త్రాణం వలన లాభం! అన్నకి ఇంత యాక్సిడెంటయినా, గుండు మాత్రం ఎలా భద్రంగా ఉందో?"

"అయితే ఇంకేం! ఈసారి కవచం కూడా 'కంప్పల్సరీ' చేయించు. గుండె కూడా భద్రంగా ఉంటుంది" విసుగ్గా అన్నాడు పరశురామయ్య.

"ఓ! అలాగే" అనబోతున్న అశ్వత్థామ నెత్తిన ఓ మొట్టె మొట్టి, "నోరు ముయ్యరా చవటా? ఇప్పటికే బుర్ర వేడెక్కి బుగ్గలు కమలిపోయి ఛస్తుంటే! అప్పుడు ఒళ్ళంతా పుండయి చావడానికా?" అన్నాడు శతృఘన్.

"అలా అనుకురా శత్రూ, వీడికి మాత్రం వాళ్ళ ఆవిడ అప్పడాల కర్ర నుంచి ఈ హెల్మెట్ గొప్ప రక్షణగా పని చేస్తుంది" అన్నాడు భరతశాస్త్రి.

"దానికేంగాని, నిజమైన లాభం ఒకటి చెప్పనా? ఇదివరకు రైల్వేస్టేషన్లో, బస్టాండులో ఆటో కావాలా, రిక్షా కావాలా అని చంపేవాళ్ళు. ఇప్పుడు చేతిలో హెల్మెట్ చూసి వెంటబడటం మానేశారు. హాయిగా ఉంది ప్రాణం. కాదంటావా?" అన్నాడు చంద్రబాబు.

"అంతే? అంతే? అల్లాంటి వెధవముండా లాభాలు చూసి మురిసి పోవాలిసిందే?" అన్నాడు పరశురామయ్య.

"అవును గురూ ఇంకో సంగతి! సిటీ స్పీడ్ లిమిట్ ఇరవై నాలుగు కిలోమీటర్లే కదా? ఈ స్పీడ్‌కి హెల్మెట్ కావాలంటావా?" అని అడిగాడు మళ్ళీ భరతశాస్త్రి.

"ఆ స్పీడ్‌లో ఎవడూ వెళ్ళడం లేదుగా? అందుకనే హెల్మెట్" అన్నాడు అశ్వత్థామ.

"మరి అప్పుడే పోయిందిగా నీ డిసిప్లిన్, నీ సేఫ్టీ? ఇలా చేతగాని రూల్స్ "పొడిగించడం దేనికి?" అన్నాడు భరతశాస్త్రి.

"నాకు తెలియక అడుగుతున్నాను, ముందరో సంగతి చెప్పు శిష్యా? అసలీ హెల్మెట్ కంమ్పల్సరీ ఎందుకు?" అడిగాడు కృష్ణమూర్తి.

"ఎందుకేమిటి? అయితే యాక్సిడెంట్ తల పగిలి చావకుండా ఉండటానికి" అన్నాడు అశ్వత్థామ.

"అంతేనా? యాక్సిడెంట్ అవకుండా ఏమన్నా ఆపగలదా?" అడిగాడు కృష్ణమూర్తి.

"ఎలా ఆపుతుంది? ఆపలేదు" అన్నాడు అశ్వత్థామ.

"అలా అయితే ప్రమాదం అవుతుంది అనుకున్న ప్రతిచోటా, ప్రతి దానికీ ఏదో ఒక కంమ్పల్సరీ పెట్టద్దూ?!" అన్నాడు కృష్ణమూర్తి.

"యాక్సిడెంట్ స్కూటర్ మీది వాడికే కాకుండా, సైకిల్ మీద వెళ్ళేవాడికి కూడా అవచ్చు. వాళ్ళకి కూడా హెల్మెట్లు కంమ్పల్సరీ చేస్తే పోతుంది" అన్నాడు సైంధవుడు మధ్యలో అడ్డుపడి.



అసలు స్కూటర్లే ఎత్తేస్తే యాక్సిడెంట్ ఉండదుగా" అన్నాడు పరశురామయ్య చిరాగ్గా.

"అలాకాదు గాని, సిగరెట్ ప్యాకెట్‌మీద 'పొగ త్రాడగం ఆరోగ్యానికి హానికరం' అని వ్రాసినట్టుగా ప్రతి స్కూటరు మీదా 'హెల్మెట్ లేకుండా నడపడం తలకి ప్రమాదం' అనీ వ్రాయమంటే సరిపోతుంది" అన్నాడు భరతశాస్త్రి.

"కరెక్టుగా చెప్పావ్! సిగరెట్, మద్యంవంటి ప్రమాదకరమైన వాటిని ఎన్నిటినో వదిలిపెట్టి ఈ హెల్మెట్ల మీద పడటం ఎల్లాంటిదంటే దొడ్డిదారిని గడ్డపలుగులు పోతుంటే, వీధి దారిన గుండుసూదులు పట్టుకుని వెళ్ళాడటం అలాంటిది" అన్నాడు కృష్ణమూర్తి.

"సర్లెంద్రా? అసలేం జరిగిందో తెలియక ఛస్తుంటే? అన్నా? అసలు యాక్సిడెంట్ ఎలా అయింది?" అడిగాడు లక్ష్మణరావు.

మెల్లిగా ఊపిరి తీసుకుని, "ఆ వెధవ హెల్మెట్ మూలంగా అయిందిరా నాయనా?" మూలుగుతూ చెప్పాడు రాముడు.

"హెల్మెట్ మూలంగానా?" ఆశ్చర్యపోయారందరూ?

"ఆహా? హెల్మెట్ మూలంగానే?" అన్నాడు రాముడు.

"ఎట్లా? ఎట్లా? చెప్పు, చెప్పు" అన్నాడు పరశురామయ్య.

"బండిమీద వెళుతున్నానా! అటు ఎండ మండిపోతుందా - ఇటు చెమటతో కారిపోతుందా. హెల్మెట్‌లో తల మగ్గిపోతోందా? ఇంతలో హఠాత్తుగా భయంకరంగా తల దురద పెట్టసాగింది. గోక్కుందామంటే వెధవ హెల్మెట్ అడ్డం! అమాంతం రోడ్డు మధ్యలో అపలేను కదా? ఆపేలోపలే అసంకల్పిత ప్రతీకార చర్యగా రెండు చేతులూ హెల్మెట్ తీసేప్రయత్నంలో పడ్డాయి. నేనొచ్చి హాస్పిటల్‌లో పడ్డాను."

అందరూ ఆలోచిస్తూ ఉండిపోయారు. మళ్ళీ రాముడే అందుకున్నాడు. "అవునూ? ఇంతసేపూ ఆ సైంధవుడు గాడేమిటి? ఇంకా హెల్మెట్ నెత్తినే పెట్టుకున్నాడు. లోపలికి వచ్చినా కూడా? అంత చమ్మగా ఉందా వాడికి?"

వెంటనే లక్ష్మణుడు తేరుకున్నాడు. "లేదన్నా లేదు, వాడికి అసలు హెల్మెట్ లేదు."

"మరేమిటి?" అడిగాడు రాముడు.

"అదా? ఈ వెధవ శిరస్త్రాణంతో తల ప్రాణం తోకకొచ్చి - అది పెట్టుకోనూలేక - స్కూటరు వదలనూలేక - హాయిగా తల గుండు కొట్టిం చేసి, పెయింట్ వేశేశాళ్ళే! అంతే!"